ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 26.05.2025 సమయం: 01.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం దేశంలోనే మొదటిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

2. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంత్రివర్గ విస్తరణపై పార్టీ ముఖ్య నేతలతో సమావేశమవుతున్నారు.

3. ప్రధానమంత్రి నరేంద్రమోది నేతృత్వంలోని ఎన్డిఏ ప్రభుత్వం నేటితో పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

4. కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలు ఈ రాత్రి నవరత్నమాల హారతితో ముగియనున్నాయి.

**DY CM**

విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం దేశం లోనే ఇది మొదటిసారి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ ఉదయం ప్రజాభవన్ లో జరిగిన కార్యక్రమంలో NPDCL పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును , ఆయన భార్యకు కారుణ్య నియామక ఉత్తర్వులను ఉప ముఖ్యమంత్రి అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...

కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చామన్నారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి విద్యుత్తు , బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

(PN)

**CM DELHI TOUR**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ , కేంద్ర మంత్రి కుమారస్వామితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశ, గ్రేటర్ హైదరాబాద్ కు 800ల ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై కేంద్ర అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో సమావేశమయ్యారు. ఈరోజు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అనంతరం హైదరాబాద్ కు తిరిగి పయనమవుతారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

(SHANKAR)

**PM - 11 YEARS**

ప్రధానమంత్రి నరేంద్రమోది నేతృత్వంలోని ప్రభుత్వం ఈరోజుతో పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 2014లో ఇదే రోజున భారత ప్రధానమంత్రిగా నరేంద్రమోది ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మన దేశంలో 30 సంవత్సరాల సంకీర్ణ రాజకీయాలకు అంతం పలుకుతూ ప్రజలు స్పష్టమైన , నిర్ణయాత్మక,

తీర్పును ఇవ్వడంతో దేశ ఆధునిక రాజకీయ చరిత్ర ఒక మలుపు తిరిగింది. భారత ప్రజల చారిత్రాత్మక తీర్పు తర్వాత మన దేశ 14వ ప్రధానమంత్రిగా నరేంద్ర మోది 2014 మే 26 సాయంత్రం రాష్ట్రపతి భవన్ ముందు ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. కాగా , అభివృద్ధికి పాటుపడడం , పేదల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలు నరేంద్ర మోదిని దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన నాయకుడిగా మార్చాయి. ప్రధానమంత్రి నరేంద్రమోది సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ , సబ్‌కా ప్రయాస్ అనే మంత్రంతో అభివృద్ధి ఆధారిత రాజకీయాలకు నాంది పలికారు. గత 11 సంవత్సరాలలో, దేశం అన్ని రంగాలలో పురోభివృద్ధి బాట పట్టింది. మన దేశం ఇప్పుడు ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది. నరేంద్రమోది నాయకత్వంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా లక్ష్యం మన దేశం ముందుకు సాగుతోంది.

NSD

**MISS WORLD**

మిస్ వరల్డ్ - 2025 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. ఇవాళ బ్యూటీ విత్ ఏ పర్సన్ కాంపిటీషన్ జరగనుంది. ఇందులో పోటీదారులు తాము చేసిన సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరిస్తారు. ఈ పోటీలో గెలిచిన వారు తర్వాతి రౌండ్ కు అర్హత సాధిస్తారు. ఇప్పటి వరకు జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన పలువురు కంటెస్టెంట్స్ తదుపరి రౌండ్ కు క్వాలిఫై అయ్యారు. ఈనెల 31న ఫైనల్స్ జరగనున్నాయి.

(DESK)

**BRS NIRAJAN REDDY**

యాసంగి ముగిసి వానాకాలం మొదలవుతున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదని బిఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి విమర్శించారు. అనేక ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు కల్లాల వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా , ఆమనగల్లులో ధాన్యం కొనుగోలు చేయాలని నిరసన తెలుపుతున్న రైతులను ఈడ్చివేయడం తప్పు అని ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయడంతో పాటు క్వింటాలుకు 500ల రూపాయల బోనస్ అందచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

(PN)

**KODADA MARKET**

కోదాడ వ్యవసాయ మార్కెట్ ను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కోదాడ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై మార్కెట్ కమిటీ సభ్యులతో తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ , వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేస్తామన్నారు. అనువైన ప్రాంతంలో ప్రత్యేకంగా పశువుల సంత ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి , మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ , వైస్ చైర్మన్ బషీర్ , జిల్లా మార్కెటింగ్ అధికారి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

(PN)

**BREAK**

**BC MEETING**

బీసీల సాధికారతపై కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహిస్తుంది. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ పక్షాన పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , మాజీ పార్లమెంటు సభ్యులు అంజన్ కుమార్ యాదవ్ , తదితరులు పాల్గొంటున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో కాంగ్రెస్ అగ్రనేత , రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల నేతృత్వంలో ఈ సమావేశం జరుగుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న తాజా , మాజీ పీసీసీ అధ్యక్షులు , బీసీ ఎంపీలు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశానికి హజరయ్యారు.

(DESK)

**SARASWATHI PUSHKARAALU**

వేలాది మంది భక్తుల పుణ్య స్నానాలతో సందడిగా జరిగిన కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలు ఈరోజు రాత్రి 7:45 గంటలకు నవరత్నమాల హారతితో ముగియనున్నాయి. నిన్న ఏకంగా 3.50 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీసమేతంగా పుష్కరాలకు హజరయ్యారు. ఇవాళ కూడా భక్తుల రద్ది నెలకొంది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భక్తుల సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

(PTC)

**RAJANNA SIRICILLA**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ , ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం ఈ నెల 31లోగా ఆన్లైన్ లో

దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి రాజ మనోహర్ రావు తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు గడువులోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొనే విధంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

(PTC, రాజన్న సిరిసిల్ల)

**TS RAINS**

ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో  నేటి నుంచి నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్ , నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు , ఇతర జిల్లాల్లో  తేలికపాటి వర్షాలు  కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ లోనూ ద్రోణి ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈరోజు, రేపు కొన్ని చోట్ల భారీ వర్షాలు కురవడంతో పాటు, పలు ప్రాంతాల్లో పిడుగులు పడేఅవకాశం ఉన్నట్లు తెలియచేసింది.

(PN)

**WARANGAL**

వరంగల్ జిల్లాలోని భద్రకాళి చెరువు మధ్యలో నక్షత్ర వనాలు  , పక్షుల నివాసాలు, ఐలాండ్స్ ఏర్పాటు చేసే కార్యాచరణలో వేగం పెరిగింది. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అధికారుల పర్యవేక్షణలో ఐలాండ్స్ ఏర్పాటు  పనులు కొనసాగుతున్నాయి. చెరువులో పూడిక తీసిన మట్టిని ఐదు చోట్ల పెద్ద కుప్పలుగా పోసి వాటిని ఐలాండ్స్ గా అభివృద్ధి చేస్తున్నారు.  భద్రకాళి దేవాలయానికి వచ్చే భక్తులు బోటు

ద్వారా నక్షత్ర వనాలు , ఐలాండ్ ల వద్దకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జన్మ నక్షత్రాల మొక్కలు, పక్షులను ఆకర్షించే మొక్కలు వాటిలో పెంచనున్నారు.
(PTC)

**MAHABOOBABAD**

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా వాగులు , చెరువులు, వంకలు, తదితర ప్రదేశాలను సందర్శించాలని , గత సంవత్సరం సంభవించిన వరదల నేపథ్యంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.
(PTC)